సాక్షి
మహబూబాబాద్

సోమవారం । 26 । ఆగస్టు । 2024



సాకులు చెప్పకుండా రుణమాఫీ చేయాలి

రైతులకు ఇచ్చిన హామీ మేరకు సాకులు చెప్పకుండా రూ.2లక్షల రుణమాఫీ చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు.

- 8లో▸



కేయూలో శంకుస్థాపనలు

కాకతీయ యూనివర్సిటీలో ఆదివారం పలు అభివృద్ధి పనులకు వర్సిటీ అభివృద్ధి అధికారి ఎస్. వాసుదేవరెడ్డితో కలిసి రిజిస్ట్రార్ మల్లారెడ్డి శంకుస్థాపన చేశారు.

- 8లో▸



వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై పలుచోట్ల చిరుజల్లుల నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

'సాక్షి' ఫోన్‌ఇన్





నెహ్రూసెంటర్: గ్రామాలు, పట్టణాల్లో సీజనల్ వ్యాధులు, డెంగీ, చికున్‌గున్యా ప్రబలుతున్నాయి. జ్వరాలు పెరిగి ప్లేట్‌లెట్స్ తగ్గి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జ్వరం నుంచి కోలుకున్న తర్వాత ఒంటి నొప్పులతో నీరసించిపోతున్నారు. ఈనేపథ్యంలో సీజనల్ వ్యాధుల వైద్యం, సందేహాలు, వైద్య సలహాల కోసం మహబూబాబాద్ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావుతో 'సాక్షి' ఫోన్‌ఇన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. వైద్యం, వైద్య సలహాలు, సూచనలు చేయడంతో పాటు సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.

సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు :
93901 09191, 96034 62487, 99639 29800

సమయం : మంగళవారం (ఈనెల 27న)
ఉదయం : 11గంటల నుంచి 12గంటల వరకు

న్యూస్‌రీల్

ఎన్నిక



మహబూబాబాద్ రూరల్ : జిల్లా కేంద్రం శివారులోని అనంతాద్రి శ్రీవేంకటేశ్వరస్వామివారి దేవాలయ ప్రాంగణంలో ఆదివారం విశ్వహిందూ పరిషత్ జిల్లా అర్చక సంఘం ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా అనంతాద్రి దేవాలయ ప్రధాన అర్చకులు విజయకుమారాచార్యులు, జిల్లా ఉపాధ్యక్షులుగా గార్ల మండలం పుల్లూరు శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయ ప్రధాన అర్చకులు సుదర్శనాచార్యులును ఎన్నుకున్నారు. త్వరలోనే జిల్లా కమిటీతోపాటు జిల్లాలోని మండలాలకు అధ్యక్ష, కార్యదర్శులను ఎన్నుకుంటామని సంఘం బాధ్యులు తెలిపారు.

జయప్రదం చేయాలి

నెల్లికుదురు: నైజాం సర్కార్ పాలన అకృత్యాలపై తెలంగాణ ప్రజలు పోరాడేందుకు చైతన్యం చేసేందుకు ఇనుగుర్తి గ్రామంలో వెలసిన తొలి తెలుగు దినపత్రిక తెనుగు పత్రిక శత సంవత్సర ఉత్సవాలకు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఒద్దిరాజు చారిట్రబల్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు ఒద్దిరాజు సుభాష్ కోరారు. జిల్లాలోని వివిధ మండలాల ప్రింట్, ఎలక్ట్రానిక్ జర్నలిస్టులు, అభిమానులు తరలి రావాలని ఆదివారం విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. ఇనుగుర్తి మండల కేంద్రంలోని రైతు వేదికలో ఈ నెల 27న ఈ వేడుకలతోపాటు సీనియర్ జర్నలిస్టుల సన్మాన కార్యక్రమానికి ప్రముఖ పాత్రికేయుడు, ఎడిటర్ దేవులపల్లి అమర్‌తోపాటు పత్రికా ప్రముఖులు, జిల్లా పత్రికా సంఘాల బాధ్యులు పాల్గొంటున్నట్లు తెలిపారు.

పలువురు సీఐల బదిలీ

మహబూబాబాద్ రూరల్ : జిల్లా పరిధిలో పనిచేస్తున్న ఇద్దరు సీఐలు బదిలీకాగా మరో సీఐ బదిలీపై జిల్లాకు రానున్నారు. ఈ మేరకు పోలీసు శాఖ ఉన్నత అధికారులు ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ మల్టీ జోన్ వన్ ఐజీ కార్యాలయంలో వెయిటింగ్‌లో ఉన్న బి.హత్తిరాం మహబూబాబాద్ సీసీఎస్ సీఐగా విధుల్లో చేరనున్నారు. మహబూబాబాద్ సీసీఎస్ సీఐగా పనిచేస్తున్న ఈ.చంద్రమౌళి మహబూబాబాద్ డిస్ట్రిక్ట్ స్పెషల్ బ్రాంచ్ విభాగానికి బదిలీ అయ్యారు. మహబూబాబాద్ డిస్ట్రిక్ట్ స్పెషల్ బ్రాంచ్ సీఐ పి.బాలాజీవరప్రసాద్‌ను హైదరాబాద్‌లోని తెలంగాణ మల్టీ జోన్ వన్ ఐజీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు.

మూగజీవి మాతృవేదన



కేసముద్రం: ప్రమాదవశాత్తు మృతిచెందిన పిల్లకోతిని తన పొత్తిళ్లలో పెట్టుకుని ఓ తల్లివానరం మాతృవేదనకు గురైన దృశ్యం మండల కేంద్రంలో ఆదివారం కన్పించింది. వివరాలిలా ఉన్నాయి.. కేసముద్రంస్టేషన్‌లోని వ్యవసాయ మార్కెట్ పరిసరాల్లో ప్రమాదవశాత్తు కిందపడటంతో గాయమైన పిల్లకోతి మృతిచెందింది. దీంతో తల్లి వానరం తన పిల్లను వదలకుండా దీనంగా చుట్టుపక్కల తిరుగుతుంది. పిల్లను లేపే ప్రయత్నం చేస్తూ, అటూ ఇటూ తిరుగుతుండటాన్ని చూసిన ప్రతి ఒక్కరూ ఆవేదన వ్యక్తం చేశారు.

నిర్లక్ష్యం..పర్యవేక్షణ లోపం

ప్రభుత్వ పాఠశాలల్లో తగ్గుతున్న విద్యార్థుల హాజరు

- పట్టించుకోని ఉపాధ్యాయులు, అధికారులు
- జనగామ ఘటనతో జిల్లాలో చర్చ
- సరిచేయకుంటే ప్రమాణాలు గల్లంతే..!



సాక్షి, మహబూబాబాద్: నూతన విద్యావిధానం ప్రకారం విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలలకు హాజరైతే కనీస విద్యా సామర్థ్యాలు నేర్చుకుంటారానే ఉద్దేశంతో హాజరు శాతాన్ని పరిగణంలోకి తీసుకొని పై తరగతులుకు అప్‌గ్రేడ్ చేస్తారు. ఇంతటి ప్రాధాన్యత ఉన్న విద్యార్థుల హాజరు శాతం జిల్లాలో రోజు రోజుకూ తగ్గిపోతోంది. అయితే దీనికి పలువురు ఉపాధ్యాయుల నిర్లక్ష్యం, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపమే కారణమనే ఆరోపణలు ఉన్నాయి.

తగ్గుతున్న హాజరు శాతం

జిల్లాలో ప్రభుత్వ, లోకల్ బాడీ పాఠశాలలు 757, కేజీబీవీలు 15, మోడల్ స్కూల్స్ ఎనిమిది కలిపి మొత్తం 780 పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో మొత్తం 45,752మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ ఇవ్వడంతోపాటు సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం పెడుతున్నారు. ఈ నిర్వహణను సక్రంగా చూసేందుకు విద్యాశాఖ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఫేస్ రికగ్నేషన్ సిస్టమ్ (డీఎస్ఈఎఫ్ఆర్ఎస్) యాప్‌ను రూపొందించారు. ఈ యాప్ ప్రకారం ప్రతీ పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం నమోదు చేస్తారు. ఇందులో విద్యార్థి ముఖం స్కాన్ చేస్తే వివరాలు వస్తాయి. ఇలా చేయడంతో విద్యార్థుల సంఖ్య కచ్చితంగా లెక్కించే అవకాశం ఉంటుంది. తప్పుడు లెక్కలు వేయకుండా కట్టడి చేసే అవకాశం ఉంది. జిల్లాలో గత నెల రోజులుగా డీఎస్ఈఎఫ్ఆర్ఎస్ ప్రకారం 80కి పైగా పాఠశాలల్లో విద్యార్థులు 25శాతానికి తక్కువగా హాజరు అయినట్లు స్పష్టం అవుతుంది. అంటే ఈ పాఠశాలల్లో విద్యార్థుల హాజరుపై ఎవరూ పట్టించుకోవడం లేదని స్పష్టం అవుతుంది.

జనగామ సంఘటనపై చర్చ

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు పదే పదే చెబుతున్నారు. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా విద్యార్థుల హాజరు పరిశీలించి 25శాతం కన్న తక్కువ ఉన్న 54పాఠశాలలను గుర్తించారు. ఇందుకు బాధ్యులుగా పరిగణిస్తూ 47మంది ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని డీఈఓను ఆదేశిండం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. అయితే మానుకోట జిల్లాలో.. జనగామ కన్నా ఎక్కువ సంఖ్యలో.. తక్కువ హాజరు ఉన్న పాఠశాలలు ఉన్నప్పటికీ చర్యలు లేకపోవడం గమనార్హం.

కొరవడిన పర్యవేక్షణ

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని విధాలుగా ప్రయత్నాలు చేసినా ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదనే విమర్శలు ఉన్నాయి. గతంలో జిల్లా విద్యా వ్యవస్థ పరిధిలో డిప్యూటీ ఈఓలు, మండల విద్యాశాఖ అధికారులు ఉండేవారు. ఈ పోస్టులకు ప్రత్యేకంగా ఉండటంతో పాఠశాలల పర్యవేక్షణ, ఉపాధ్యాయుల హాజరు, విద్యా ప్రమాణాల పరిశీలన చేసేవారు. కానీ ఇప్పుడు డిప్యూటీ ఈఓలు లేరు. జిల్లాలో 18 మండలాలు ఉంటే ఇద్దరు మాత్రమే రెగ్యూలర్ ఎంఈఓ లు ఉన్నారు. మిగిలిన వారందరు అదనపు బాధ్యలు నిర్వర్తిస్తున్న పీజీ హెచ్ఎంలే. అదేవిధంగా కాంప్లెక్స్ హెచ్ఎంలకు పర్యవేక్షణ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. వీరందరు వారు పనిచేస్తున్న పాఠశాలకు వెళ్లి అక్కడ పనులు చక్కబెట్టడం, ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాల ప్రకారం రివ్యూలు ఇవ్వడానికే సరిపోతుంది. దీంతో ఏజెన్సీ ప్రాంతాలు, మారు మూల తండాల్లో పనిచేసే పలువురు ఉపాధ్యాయులు సక్రంగా విధులకు హాజరు కాకపోవడం, ఇద్దరు, ముగ్గురు ఉన్న చోట ఉపాధ్యాయులు వంతుల వారీగా వెళ్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

హాజరు శాతం పెంచేందుకు చర్యలు

విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు చర్యలు తీసుకుంటాం. ఈ విషయంపై ఇప్పటికే ఉపాధ్యాయులకు ఖచ్చితమైన ఆదేశాలు జారీ చేశాం. తక్కువ హాజరు శాతం ఉన్న పాఠశాలలను గుర్తించి అందుకు కారణాలు తెలుసుకొని సరిచేసి, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

- రామారావు, డీఈఓ

'ఆశా'లకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలి

నెహ్రూసెంటర్: ఇరవై ఏళ్లుగా చాలీచాలనీ వేతనాలతో పని చేస్తున్న ఆశా కార్యకర్తలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని ఆశావర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాసు మాధవి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో ఆశా కార్యకర్తలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. 'ఆశా వర్కర్ల సమస్యలు- ప్రభుత్వ విధానాలు- పరిష్కార మార్గాలు' అనే అంశంపై మాధవి వివరించారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేర్చడం, మాతాశిశు మరణాలను తగ్గించడం వంటి కార్యక్రమాలను చేపడుతున్న ప్రభుత్వాలు ఆశాల సమస్యల పరిష్కారానికి చొరవ చూపడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలని, కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు ముందుకు రావాలని కోరారు. కార్మిక ఉద్యమం -సీఐటీయూ విశిష్టత అనే అంశంపై సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ ప్రసంగించారు. ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారానికి సెప్టెంబర్ 9న డీఎంహెచ్ఓ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మంకిడి రమణ, ఉపేంద్ర, రమాదేవి, స్వరూప, నీలిమా, కౌసల్య, జ్యోతి, విజయ, కుమ్మరికుంట్ల నాగన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాసు మాధవి

రైతుల సంక్షేమానికే కిసాన్ పరివార్

- కిసాన్ పరివార్ సంస్థ సీఈఓ డాక్టర్ వివేక్

కురవి: రైతుల సంక్షేమం కోసమే కిసాన్ పరివార్ సంస్థ పనిచేస్తున్నదని సంస్థ సీఈఓ డాక్టర్ వివేక్ అన్నారు. ఆదివారం కురవి మండలం కందికొండ శివారు టోల్‌ప్లాజా సమీపంలో సంస్థ ఆధ్వర్యంలో గిడ్డంగి నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. అనంతరం బానోత్ విష్ణునాయక్, గుగులోత్ భీమానాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కోల్‌కతా ఘటనలో హత్యకు గురైన డాక్టర్‌కు సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కిసాన్ పరివార్ అధినేత ననావత్ భూపాల్‌నాయక్ డోర్నకల్ నియోజకవర్గ ప్రజలకు పంచ సూత్రాల హామీ ప్రకారం ఒక్కొక్కటీ అమలు చేస్తున్నామని తెలిపారు. అందులో భాగంగానే ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ కోసం భూమి పూజ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు సురేశ్, హరిబాబు, ఎడెల్లి వెంకన్న, వెంకటేశ్వర్లు, గణేశ్, శంకర్, రాంమూర్తి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వివేక్

గవర్నర్ పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

వెంకటాపురం(ఎం): రేపు జిల్లాలో గవర్నర్ జిష్ణుదేవ్ శర్మ పర్యటించనున్న నేపథ్యంలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ దివాకర సూచించారు. మండలంలోని రామప్ప ఆలయం, సరస్సు కట్ట, టూరిజం కాటేజీలను కలెక్టర్ ఆదివారం పరిశీలించి అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. రామప్ప సరస్సు, హరిత కాటేజీల వద్ద సుందరీకరణ పనులు చేపట్టాలన్నారు. కాటేజీ గదులను శుభ్రం చేసి శానిటేషన్ చేయాలన్నారు. గవర్నర్ పర్యటన కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్ల మధ్య ఎలాంటి లోటుపాట్లు లేకుండా విజయవంతమయ్యేలా అధికారులు సమష్టిగా పనిచేయాలన్నారు. ఆయన వెంట జెడ్పీ సీఈఓ సంపత్‌రావు, టూరిజం అధికారి నాథన్, ఇరిగేషన్ ఎస్ఈ విజయభాస్కర్, డీఈ రవీందర్ రెడ్డి, డీఎంహెచ్ఓ అప్పయ్య, ట్రాన్స్‌కో ఎస్ఈ మల్హార్ నాయక్, ఏఈ సురేష్, మండల ప్రత్యేకాధికారి రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

నెల్లికుదురు: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేసినట్లు తహసీల్దార్ రాజు ఆదివారం తెలిపారు. మూడు రోజులుగా ఇసుక అక్రమ రవాణ చేస్తున్న ట్రాక్టర్లపై దాడులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 23న మండలంలోని బ్రాహ్మణకొత్తపల్లి శివారు ఆకేరు వాగు పరిధిలో 4, 24న 1, 25న మండలంలోని మునిగలవీడు గ్రామ పరిధిలోని ఆకేరు వాగు నుంచి ఇసుక తరలిస్తుండగా 6ట్రాక్టర్లు మొత్తం 11 పట్టుకున్నట్లు తెలిపారు. అయితే ఆదివారం పట్టుకున్న 6 ట్రాక్టర్లను తహసీల్దార్ కార్యాలయానికి తరలిస్తున్న క్రమంలో ఇద్దరు డ్రైవర్లు తమ ట్రాక్టర్లను దారి మళ్లించుకుని వెళ్లినట్లు తెలిపారు. కాగా, వారి సమాచారం ఉందని మళ్లీ పట్టుకుంటామని తహసీల్దార్ పేర్కొన్నారు.

గుట్టుగా గుట్కా దందా

- జిల్లాలో చాపకిందనీరులా వ్యాపారం
- రైళ్లు, వాహనాల్లో, ఆన్‌లైన్‌లో దిగుమతి
- గ్రామాలకు సైతం సరఫరా



మహబూబాబాద్ అర్బన్: జిల్లాలో గుట్కా దందా చాపకింద నీరులా విస్తరిస్తుంది. జిల్లాలో పలు కిరాణా వ్యాపారాలు కర్ణాటక, బెంగళూరు, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌లో గుట్కా నిషేధం లేకపోవడంతో అక్కడి నుంచి గుట్టుచప్పుడు కాకుండా ఇక్కడికి తీసువచ్చి విక్రయిస్తున్నారు. అక్కడ ఒక్కో ప్యాకెట్ తక్కువ ధరకు కొనుగోలు చేసి ఇక్కడ రూ.10నుంచి రూ.20వరకు విక్రయిస్తూ అక్రమ దందా కొనసాగిస్తున్నారు. రహస్య ప్రదేశాల్లోని గోదాముల్లో నిల్వ చేసి ఆపై పలు మండలాలు, గ్రామాలకు తరలిస్తూ రూ.లక్షల్లో వ్యాపారం చేస్తున్నారు. అయినా జిల్లా యంత్రాంగం చూసీచూడనట్లు వ్యవహరిస్తుందనే ఆరోపణలు ఉన్నాయి. మత్తుపదార్థాలను అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నప్పటికీ బ్రేక్ పడకపోవడం గమనార్హం. గుట్కాకు అలవాటుపడిన వ్యక్తులు ఎన్ని డబ్బులైనా చెల్లించి కొనుగోలు చేస్తుండడంతో ఈఅక్రమ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. ఇదే అదనుగా అక్రమార్కులు రెండు, మూడింతల ధర పెంచి విక్రయిస్తున్నారు. పోలీసులు జిల్లా సరిహద్దుతోపాటు జిల్లాలో సైతం దాడులు చేసి గుట్కా వ్యాపారులపై కేసులు నమోదు చేస్తున్నా.. ఈజీ మనీకి అలవాటు పడిన వ్యాపారులు ఈ దందాను ఆపడంలేదు. దీంతో జిల్లాలో గుట్కా, అంబర్, అక్రమ రవాణా అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి.

మానుకోట కేంద్రంగా దందా.

కర్ణాటక, బెంగళూరు, మహారాష్ట, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి రైళ్లు, వాహనాల్లో గుట్కాతోపాటు, గంజాయిని జిల్లాకు తీసుకొస్తున్నారు. మానుకోట, మరిపెడ, కురవి, కేసముద్రం, తొర్రూర్ కేంద్రంగా చిరు వ్యాపారులు, కిరాణా దుకాణాదారులకు చేరవేస్తున్నారు. మండలాల వారీగా దళారులను ఏర్పాటు చేసుకొని ఈ వ్యాపారం సాగిస్తున్నట్లు సమాచారం. ఎవరికి అనుమానం రాకుండా తినుబండారాలు అమ్ముతున్నట్లుగానే మోటారు సైకిళ్లు, చిన్న గూడ్స్ వాహనాలు, ట్రాలీలు, వ్యాన్లతోపాటు ఆన్‌లైన్ ద్వారా మత్తు పదార్థాలను గ్రామాలకు చేరవేస్తున్నారు. అంబర్ కాటన్ వంద ప్యాకెట్ల హోల్‌సెల్ ధర రూ.28వేలకు కొనుగోలు చేసి రిటైల్ వ్యాపారులకు రూ.35వేలకు విక్రయిస్తున్నారంటే వ్యాపారం ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. జిల్లా కేంద్రంలోని ఇల్లందు రోడ్డు, మూడు కోట్ల సెంటర్, పత్తిపాక రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్, నర్సంపేట రోడులో ఉన్న పలు కిరాణా, పాన్‌షాపులు ఈవ్యాపారాని కేంద్రాలుగా ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

మా ప్రాంతాల్లో జోరుగా వ్యాపారం



విద్యార్థులు, యువత చిన్నతనం నుంచి చెడు అలవాట్లకు దగ్గరవుతున్నారు. కేన్సర్ భారిన పడుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా అక్రమ గుట్కా వ్యాపారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి.

- నవీన్, శిఖార్‌ఖానగడ్డ, మానుకోట

గుట్కాలు విక్రయిస్తే చర్యలు

జిల్లా కేంద్రానికి వివిధ జిల్లాలు, రాష్ట్రాల నుంచి గుట్కాలు తీసుకొచ్చి అమ్మకాలు చేస్తున్నట్లు సమాచారం వచ్చింది. అక్రమ వ్యాపారులపై ప్రభుత్వ సూచన మేరకు చర్యలు తీసుకుంటాం.

- రోహిత్‌రెడ్డి, జిల్లా ఫుడ్‌సేఫ్టీ అధికారి

నిలిచిన దేవాదుల పంపింగ్

కన్నాయిగూడెం: మండల పరిధిలోని తుపాకులగూడెం గుట్టలగంగారం వద్ద గోదావరిపై నిర్మించిన దేవాదుల ప్రాజెక్టు వద్ద పంపింగ్‌ను ఆదివారం నిలిపివేసినట్లు దేవాదుల ఇంజనీరింగ్ అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం పంపింగ్ వద్ద 77మీటర్ల నీటిమట్టం కొనసాగుతోంది. ఎగువ ప్రాంతంలో నీటి వినియోగాన్ని బట్టి పంపింగ్ కొనసాగించనున్నట్లు వెల్లడించారు. సమ్మక్క సాగర్ బ్యారేజీ వద్ద ప్రస్తుతం 76.80 మీటర్ల నీటిమట్టం ఉంది. బ్యారేజీ వద్ద ఉన్న 59గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు.



గుట్టల గంగారం వద్ద నిలిచిన పంపింగ్

పత్తాలేని 'పాలకమండలి'

- నాలుగేళ్లు దాటినా నిర్వహించని సమావేశం
- గిరిజన గ్రామాల్లో అభివృద్ధి పనులు అంతంతే
- కొనసాగుతున్న అడ్వాన్సుల పర్వం
- పట్టించుకోని అధికారులు



ఏటూరునాగారంలోని ఐటీడీఏ కార్యాలయం

ఏటూరునాగారం: ఏటూరునాగారం మండల కేంద్రంలో 1986లో సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ)ను ప్రభుత్వం నెలకొల్పింది. ఉమ్మడి జిల్లాలోని గిరిజనులను, గిరిజన గ్రామాలను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతీ ఏడాది కోట్ల రూపాయల నిధులు కేటాయిస్తోంది. అయితే ఈ నిధులు సక్రమంగా ప్రభుత్వ పథకాలకు, గిరిజనుల అభివృద్ధికి వినియోగిస్తున్నారా లేదా అనేది ప్రతీ మూడు నెలలకు ఒకసారి నిధుల కేటాయింపు, అభివృద్ధి పనుల వివరాలను అధికారులతో చర్చించడానికి ఐటీడీఏ చైర్మన్ జిల్లా కలెక్టర్, మంత్రుల సమక్షంలో చర్చించడానికి పాలకమండలి సమావేశం నిర్వహించాలని ప్రభుత్వ నిర్దేశించింది. అయితే ప్రతీ మూడు నెలలకోమారు నిర్వహించాల్సిన పాలకమండలి సమావేశం రాను రాను నెలలు, సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ నిర్వహించడం లేదు. 20 డిసెంబర్ 2019లో ఐటీడీఏలో 60వ పాలక మండలి సమావేశాన్ని నిర్వహించారు. అధికారులు సమస్యలను పరిష్కరించాలని, సమావేశాలు మూడు నెలలకోమారు నిర్వహించుకోవాలని కలెక్టర్‌ను మంత్రులు అప్పటి సమావేశంలో ఆదేశించారు. ఇప్పటికీ నాలుగేళ్లు దాటినా పాలకమండలి పత్తా లేకుండా పోవడంతో అభివృద్ధి, సంక్షేమ పథకాలపై చర్చ లేకుండా పోయింది. ఈ క్రమంలో అధికారులు రికార్డుల్లో మాయ లెక్కలు చూపి దోచుకుంటున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

అడ్వాన్స్‌గా డబ్బులు ఇవ్వద్దని ఆదేశాలు ఉన్నా..

ఐటీడీఏ పరిధిలో 13 ఏజెన్సీ మండలాలు ఉన్నాయి. అందులో 274 పంచాయతీలు, 559 రెవెన్యూ గిరిజన గ్రామాలుండగా 3.15లక్షల మంది గిరిజన జనాభా ఉంది. వాజేడు, వెంకటాపురం మండలాలు ములుగు జిల్లాలో కలిసినప్పటికీ గిరిజనుల విషయంలో ఐటీడీఏ భద్రాచలం నుంచి మానిటరింగ్ చేయడం జరుగుతోంది. ఐటీడీఏలో 2004లో నిధులు దుర్వినియోగం కావడంతో అప్పటి నుంచి అడ్వాన్సుల పర్వం తగ్గుముఖం పట్టింది. అడ్వాన్స్‌గా డబ్బులు ఇవ్వరాదని పాలకులు, ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. కానీ ఐటీడీఏ ఇంజనీరింగ్ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా పనులు చేయకముందే కాంట్రాక్టర్‌లకు అడ్వాన్స్‌లు అందజేస్తున్నట్లు సమాచారం. అడ్వాన్స్‌లు ఎవరెవరికీ ఎంత ఇచ్చారన్న దానిపై అధికారులను విచారణ చేస్తే నిజాలు బయటకు వచ్చే అవకాశం ఉంది. అయినా అది జరగడం లేదు.

ఆడిట్‌లో లోపాలు

ఐటీడీఏ ద్వారా జమ, ఖర్చు వివరాలను ప్రతీ ఏడాది అకౌంట్స్ జనరల్‌తో ఆడిట్ చేయించి అందులో అవినీతి అక్రమాలను సైతం బయటపెట్టాల్సి ఉంటుంది. కానీ అధికారులే చార్టెడ్ అకౌంట్ వ్యక్తిని మాట్లాడుకొని వీరే అన్ని రికార్డులు తయారు చేసి వారికి మర్యాదలు చేసి ఫైల్స్ క్లియర్‌గా ఉన్నట్లు సంతకాలు చేయించడం ఆనవాయితీగా వస్తుందని గిరిజనులు ఆరోపిస్తున్నారు.


ప్రస్తుతం కొనసాగుతున్న పథకాలు

ఐటీడీఏలోని ఆయా విభాగాల్లో ఎకనామికల్ సపోర్ట్ స్కీం, డ్రైవర్ అండ్ ఓనర్ పథకం కింద గూడ్స్ వాహనాలను సబ్సిడీ ద్వారా అందజేయడం, వైటీసీలో నిరుద్యోగులకు శిక్షణ ఇస్తున్నారు. అదే విధంగా రైతుబంధు, ఆర్ఓఎఫ్ఆర్ హక్కు పత్రాల సమస్యల పరిష్కారం, గిరిజన పల్లెలకు విద్యుత్ సరఫరా, ఆశ్రమ పాఠశాలలు, వైద్య ఆరోగ్య సేవలను అందిస్తున్నారు. అలాగే జీపీఎం, డీటీటీ, డీఎల్ఎం ఏటీలతో పాటు గిరిజన నిరుద్యోగులకు డ్రైవింగ్ శిక్షణ కూడా ఇస్తున్నారు. కానీ వీటిపై విచారణ లేకపోవడంతో అవినీతి అక్రమాలు ఆయా విభాగాల్లో కొనసాగుతున్నాయని గిరిజన సంఘాలు ఆరోపిస్తున్నాయి.

అధికారులు సమర్థవంతంగా పనిచేయాలి

ఐటీడీఏ పరిధిలోని ఆయా శాఖల అధికారులు గిరిజనులకు అందించే పథకాలపై సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలి. మంత్రులు ఐటీడీఏపై దృష్టి పెట్టి గిరిజనుల అభివృద్ధికి కృషి చేయాలి. ఐటీడీఏలో అవినీతి అక్రమాలు కొనసాగుతున్నా కలెక్టర్, ఐటీడీఏ పీఓలు స్పందించడం లేదు.

- మైపతి అరుణ్‌కుమార్, తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు



ప్రకృతి అందాల కనువిందు

పాండవులగుట్ట.. కింద పచ్చని పొలాలు.. అక్కడక్కడ గ్రామాలు.. జిల్లాలోని బయ్యారం సమీపంలో పాండవుల గుట్టపైనుంచి కిందకు చూస్తే ఆహ్లాదకర వాతావరణం.. ప్రకృతి ప్రేమికుల మనసు దోచుకుంటోంది. - బయ్యారం

లక్నవరంలో పెద్ద త్రివర్ణ పతాకం ఏర్పాటు చేయాలి

- టూరిజం కార్పొరేషన్ ప్రచారకర్త రామన్న

గోవిందరావుపేట: లక్నవరం సరస్సు దీవుల్లో శాశ్వత అతి పెద్ద త్రివర్ణ పతాకం ఏర్పాటు చేయాలని టూరిజం కార్పొరేషన్ ప్రచారకర్త పులియాల రామన్న అధికారులను కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని బుస్సాపూర్ సమీపంలోని కాకతీయులు నిర్మించిన లక్నవరం సరస్సులోని రెండు దీవుల్లో టూరిజం శాఖ కాటేజీలు నిర్మించి పర్యాటకులకు అందుబాటులో తీసుకొచ్చిందన్నారు. మొదటి దీవిని కలుపుతూ జంట వంతెనలు నిర్మించారని, జంట వంతెనల అందం వర్ణించలేమన్నారు. రాష్ట్ర, దేశ, విదేశీ పర్యాటకులు లక్నవరం అందాలు చూసి ముగ్ధులవుతున్నారన్నారు. ఈ క్రమంలో దేశఖ్యాతి, సరస్సు అందాన్ని మరింత పెంచాలంటే లక్నవరం ఐలాండ్‌లో హుస్సేన్‌సాగర్ తరహాలో అతిపెద్ద జాతీయ జెండాను ఏర్పాటు చేయాలన్నారు. అప్పుడే పర్యాటకులను ఆకట్టుకోవడంతో పాటు దేశ ఖ్యాతిని గౌరవించే వారమవుతామన్నారు. అలాగే, సరస్సు గుట్టపై నుంచి మొదటి ఐలాండ్‌కు రోప్ వే కన్వేయర్ ఏర్పాటు చేస్తే పర్యాటకులకు మరింత ఆనందం కలుగుతుందన్నారు. జిల్లా అధికారులు ఈ అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని రామన్న కోరారు.

షార్ట్‌సర్క్యూట్‌తో కంప్యూటర్లు దగ్ధం

- ఎస్‌బీఐ తొర్రూరు శాఖలో ఘటన


దగ్ధమైన ఫర్నిచర్

తొర్రూరు: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ)లో రెండు కంప్యూటర్లలో షార్ట్ సర్క్యూట్ సంభవించింది. ఈ ఘటనలో స్వల్ప మంటలు చెలరేగి బ్యాంకు మొత్తం పొగతో కమ్ముకుంది. ఈ ప్రమాదం మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో చోటు చేసుకుంది. ఆదివారం బ్యాంకు సెలవు. అయితే సిబ్బంది బ్యాంకుకు కావాల్సిన పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో ఓ కంప్యూటర్‌లో పొగలు వచ్చి మరో కంప్యూటర్‌కు వ్యాపించాయి. దీంతో బ్యాంకు నుంచి భారీగా పొగ రావడంతో అప్రమత్తమైన సిబ్బంది వెంటనే పోలీసులకు సమాచారం అందించగా వారు హుటాహుటినా ఘటనాస్థలికి చేరుకుని మంటలు ఆర్పేశారు. ఈ మంటల్లో కొన్ని ఫైల్స్, కంప్లైట్స్ బాక్స్, రెండు కంప్యూటర్లు, కొంతమేరకు ఫర్నిచర్ దగ్ధమైందని బ్యాంకు సిబ్బంది తెలిపారు.



కట్టుబట్టలే మిగిలాయి..


దగ్ధమవుతున్న గుడిసె


కాలిబూడిదైన ఇల్లు, వస్తువులు


రోదిస్తున్న తల్లీకూతురు

- కొత్తమల్లూరులో గుడిసె దగ్ధం
- రూ.4 లక్షల వరకు ఆస్తి నష్టం
- మిన్నంటిన బాధితుల రోదనలు

మంగపేట: సాధారణంగా పండుగ రోజు ప్రతి ఇల్లు కళకళలాడుతుంది. కుటుంబీకులు, బంధువుల ఆటాపాటలతో సందడిగా మారుతుంది. కానీ ఓ ఇంట్లో మాత్రం నవ్వుకు బదులు కన్నీళ్లు.. సంతోషానికి బదులు విషాదం నెలకొంది. దీనికి కారణం అగ్ని ప్రమాదం. ఈ ఘటనలో ఇల్లు(గుడిసె) పూర్తిగా దగ్ధమైంది. సర్వం అగ్నికి ఆహుతైంది. కేవలం కట్టుబట్టలే మిగిలాయి. దీంతో బాధితుల రోదనలు మిన్నంటాయి. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని కొత్తమల్లూరు గ్రామానికి చెందిన రెబ్బల రాములు, రమాదేవి దంపతులు నిరుపేదలు. కూ లి పని వెళ్లి జీవనం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో గ్రామంలో ఆదివారం బోనాల పండుగ నిర్వహించారు. రాములు కూలి పనికి వెళ్లగా రమాదేవి తన కుమార్తె కల్యాణి బోనం ఎత్తుకుని ఆలయానికి వెళ్లారు. కొంత సమయం తరువాత ఇంటి నుంచి మంటలు వస్తున్నాయని ఇరుగు పొరుగువారు కేకలు వేశారు. దీనిపై సమాచారం అందుకు న్న మహిళలు, గ్రామస్తులు మంటలు ఆర్పేందుకు ఇంటి దగ్గరకు వెళ్లారు. అప్పటికే మంటలు తీవ్ర కావడంతో ఆర్పేందుకు ఎంత ప్రయత్నించినా ఫలి తం లేకుండా పోయింది. షార్ట్ సర్క్యూట్‌తో ప్రమా దం జరిగి ఉంటుందని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనలో ఇంట్లోని బీరువాలో దాచి పెట్టిన రెండున్నర తులాల బంగారు ఆభరణాలు, సుమారు 25 తులాల వెండి పట్టీలు, రూ. 90 వేల వరకు నగదుతో పాటు టీవీ, మంచాలు, బియ్యం, బట్టలు, గృహోపకరణాలు పూర్తిగా కాలిబూడిదయ్యాయి. దీంతో సుమారు రూ.4 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని బాధితురాలు రాములు, రామాదేవి దంపతులు కన్నీరుమున్నీరయ్యారు. తాము ఇప్పుడెలా బతకాలని గుండెలు బాదుకుంటూ తల్లీకూతుళ్లు రోదించిన తీరు ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించింది. తాను డిగ్రీలో చేరందుకు సిద్ధం చేసుకున్న టెన్త్ మెమో, ఇంటర్ సెకండియర్ సర్టిఫికెట్, రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు అన్ని గద్ధమయ్యాయని, ఇప్పుడు తన పరిస్థితి ఏమిటని కుమార్తె రోదించిన తీరు అందరిని కలిచి వేసింది. కాగా, ఈ అగ్నిప్రమాదం షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిందా? లేదా మరే ఇతర కారణం వల్ల జరిగిందా అనే విషయం తెలియాల్సి ఉంది.

రూ. 5వేల ఆర్థిక సాయం..

కూలీ పనులే ఆధారంగా జీవనం సాగిస్తూ అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయి కట్టుబట్టలే మిగిలిని నిరుపేద బాధిత కుటుంబానికి ఎస్సై టీవీఆర్ సూరి రూ. 5వేల ఆర్థిక సాయం అందజేశారు. అగ్నిప్రమాద విషయం తెలుసుకుని ఘటనా స్థలిని పరిశీలించారు. బాధిత కుటుంబాన్ని ప్రమాదం ఎలా జరిగిందనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పరంగా కుటుంబానికి న్యాయం జరిగే విధంగా చూస్తామన్నారు.

కేయూలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన


కేయూలో లైబ్రరీ వద్ద పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో ఆదివారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. యూనివర్సిటీలోని కేంద్ర గ్రంథాలయం, ఇతర ప్రాంతాల్లో టాయ్‌లెట్స్, వాష్‌రూమ్‌లు, రెస్ట్ రూమ్‌ల ఏర్పాటుకు రిజిస్ట్రార్ మల్లారెడ్డి.. వర్సిటీ అభివృద్ధి అధికారి ఎస్. వాసుదేవరెడ్డితో కలిసి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. యూనివర్సిటీ క్యాంపస్‌లో మొత్తం 10 టాయ్‌లెట్స్ బ్లాక్‌లు ఒక్కొక్క బ్లాక్ రూ 10.50 లక్షల చొప్పున వ్యయంతో నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగంలో యూనివర్సిటీ ఇంజనీర్ పొన్నాల రామయ్య, లైబ్రరీ అసిస్టెంట్లు తేజావత్ జావేర్, ఐజాక్ ప్రభాకర్, డాక్టర్ రవిశంకర్, బిల్డింగ్ డివిజన్ బాధ్యులు తేజావత్ జావేర్, ఇజాక్ సుధాకర్, రవిశంకర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. అన్నిపనులకు ఒకే చోట లైబ్రరీ వద్ద శంకుస్థాపన చేశారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

- రూ.12లక్షల నగదు, 11 తులాల బంగారం అపహరణ
- నర్సంపేటలో ఘటన


చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న నర్సంపేట టౌన్ సీఐ రమణమూర్తి

నర్సంపేట రూరల్ : తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటన నర్సంపేట పట్టణంలో జరిగింది. నర్సంపేట టౌన్ సీఐ రమణమూర్తి కథనం ప్రకారం.. పట్టణంలోని వరంగల్ రోడ్డు వివేకానంద కాలనీకి చెందిన మేడవరపు కమలాకర్‌రావు నల్లబెల్లి మండలంలోని రుద్రగూడెంలో ఓ ప్రైవేట్ పాఠశాల నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం పని నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్ వెళ్లాడు. ఆదివారం తెల్లవారుజామున ఇంటికి వచ్చి చూడగా వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. దీంతో అనుమానం వచ్చి బీరువా చూడగా అందులోని రూ. 12 లక్షల నగదు, 11 తులాల బంగారం కనిపించలేదు. దీంతో చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్నారు. క్లూస్ టీం, జాగిలాలతో ఇల్లు, చుట్టు పక్కల పరిసరాలను పరిశీలించారు. అనంతరం బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆరు టన్నుల నల్లబెల్లం పట్టివేత


నల్లబెల్లం లోడ్‌తో పట్టుకున్న వ్యాన్‌ను చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

గూడూరు: మండలంలోని దుబ్బగూడెం, చిల్ల గండితండాల్లో నిర్వహించిన దాడుల్లో ఆరు టన్నుల నల్లబెల్లంతో పాటు 2 వందల కిలోల పటిక, 60 లీటర్ల గుడుంబా పట్టుకుని ఓ వ్యాన్, ఆటో, రెండు బైక్‌లు సీజ్ చేసి పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ ఎన్. భిక్షపతి ఆదివారం తెలిపారు. ఈ రెండు గ్రామాల్లో దాడులు నిర్వహించి కొమ్ముగూడేనికి భూక్య బావ్‌సింగ్, లైన్‌తండాకు చెందిన బానోతు దేవ్, అజ్మీరా సూర్య, దుబ్బగూడేనికి చెందిన అజ్మీరా చిన్న, లక్ష్మణ్‌తండాకు చెందిన లావుడ్య బాలు, చిల్లగండితండాకు చెందిన గుగులోతు జ్యోతి, ఏపీలోని కడప జిల్లాకు చెందిన మీసాల వెంకటరమణ, దెరంగుల శివకుమార్‌పై కేసు నమోదు చేశామన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై రాజేశ్వరి, హెడ్‌కానిస్టేబుల్ బుచ్చయ్య, కానిస్టేబుళ్లు సుధాకర్, నరేశ్, వెంకన్న, బాలకృష్ణ, దేవేందర్, యుగేంధర్, గద్దర్, సాయిరామ్, మనోజ్, మల్లికార్జున్, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఫేక్ నంబర్ ప్లేట్‌తో ఇసుక తరలింపు

- లారీని సీజ్ చేసిన పోలీసులు


ఫేక్ నంబర్ ప్లేట్‌తో ఇసుక తరలిస్తున్న లారీని పట్టుకున్న పోలీసులు

వెంకటాపురం(కె): మండలంలోని ఒంటిచింతలగూడెం ఇసుక ర్యాంప్ నుంచి ఫేక్ నంబర్ ప్లేట్ అమర్చుకుని ఇసుక తరలిస్తున్న లారీని పోలీసులు ఆదివారం సీజ్ చేశారు. ఎస్సై కొప్పుల తిరుపతిరావు కథనం ప్రకారం.. శనివారం సాయంత్రం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల చెందిన నేనావత్ సురేశ్, పట్లావత్ శ్రావణ్ ఒంటి చింతలగూడెం ఇసుక ర్యాంప్ నుంచి ఫేక్ నంబర్ ప్లేట్‌తో హైదరాబాద్‌కు ఇసుక తరలిస్తున్నారు. దీనిపై టీఎస్ఎండీసీ అధికారుల సమాచారం మేరకు మండల కేంద్రంలోని శివాలయం వద్ద వాహన తనిఖీల్లో లారీని పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. పట్టుకున్న లారీని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతిరావు పేర్కొన్నారు.

సమాజ చైతన్యంలో ముందుండాలి


కిరణ్మయి రచించిన పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ సురభివాణి, గ్రంథాలయ చైర్మన్ ఎండీ. రియాజ్

- ఎమ్మెల్సీ సురభివాణి

విద్యారణ్యపురి : కవులు, రచయితలు సమాజాన్ని చైతన్యపరచడంలో ముందుండాలని ఎమ్మెల్సీ సురభివాణి అన్నారు. భాషోపాధ్యాయురాలు రావుల కిరణ్మయి రచించిన బొడ్రవుతు కథా సంపుటిని, పీవీ నర్సింహారావు ఉయ్యాల పాటపుస్తకాన్ని చక్రవర్తుల రాధాకృష్ణ సాహితీవేదిక ఆధ్వర్యంలో ఆదివారం హనుమకొండ వడ్డేపల్లిరోడ్డులోని పీఆర్ రెడ్డి భవన్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సురభివాణి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ కిరణ్మయి ఉయ్యాల పాట రూపంలో పీవీ చరిత్ర రాయడం గొప్ప ప్రయోగమన్నారు. కిరణ్మయి ఆలోచన విధానాన్ని ఈ సందర్భంగా అభినందించారు. రాష్ట్ర గ్రంథాలయం సంస్థ చైర్మన్ ఎండీ. రియాజ్ పీవీ నర్సింహారావు అనుసరించిన విధానాలు, సేవలను కొనియాడారు. పలువురు వక్తలు మాట్లాడుతూ బొడ్రవుతు కథల్లో రచయిత రాసిన అనేక సామెతలను ప్రస్తావిస్తూ ఆమెకు పల్లెజీవితంపై తెలంగాణ భాష, యాసపై పట్టును కొనియాడారు. కార్యక్రమంలో ప్రముఖ కథా రచయిత బీవీఎన్ స్వామి బొడ్రవుతు కథా సంపుటిని సమీక్షించారు. కవయిత్రి, హిందీ స్కూల్ అసిస్టెంట్ మెరుగు అనురాధ పీవీ నర్సింహారావు ఉయ్యాల పాట పుస్తకాన్ని సమీక్షించారు. సమావేశానికి చక్రవర్తుల సాహితీవేదిక అధ్యక్షుడు చక్రవర్తుల శ్రీనివాస్ అధ్యక్షత వహించగా ప్రముఖ నవలా రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ అంపశయ్య నవీన్, జానపద విజ్ఞానవేత్త, తెలుగు యూనివర్సిటీ పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య భక్తవత్సలరెడ్డి, కరీంనగర్‌లోని పీవీ సాహిత్యపీఠం అధ్యక్షుడు కల్వకోట వెంకట సంతోశ్‌బాబు, కవి, రచయిత నంది పురస్కార గ్రహీత రావుల పుల్లాచారి, నిర్వాహకులు తెలుగు స్కూల్ అసిస్టెంట్ డాక్టర్ అడ్లూరి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాతకు ఆభరణాల బహూకరణ


దుర్గామాతకు ఆభరణాలు అందజేస్తున్న కొండా మురళి

చిల్పూరు: మండలంలోని శ్రీపతిపల్లిలోని విష్ణుదుర్గామాతకు ఆదివారం కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి బంగారు ఆభరణాలను బహూకరించారు. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, దుర్గామాత ఆలయ చైర్మన్ కేశిరెడ్డి ప్రత్యూష, బీఆర్ఎస్ నియోజకవర్గ కోఆర్డినేటర్ కేశిరెడ్డి మనోజ్‌రెడ్డికి గతంలో ఇచ్చిన హామీ మేరకు రూ. 8 లక్షల విలువైన బంగారు హారం, పుస్తెలు, కమ్మలు ఉదయం హనుమకొండ నుంచి కొండా మురళి తీసుకురాగా ఆయనకు ఘనస్వాగతం పలికారు. కోలాటం, డప్పుచప్పుళ్లు, పోతరాజుల విన్యాసాల మధ్య ర్యాలీగా ఆలయానికి చేరుకున్నారు.

ఎమ్మెల్యే శ్రీహరి నన్ను ఇబ్బంది పెట్టలేదు : మురళి

ఆలయంలో మొక్కులు తీర్చుకున్న అనంతరం కొండామురళి మాట్లాడుతూ దుర్గామాత ఆశీస్సులు గ్రామప్రజలకు ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఇటీవల స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తమను ఇబ్బంది పెట్టలేదన్నారు. గుళ్లు, గోపురాలకు రాజకీయాలకతీతంగా ఇప్పుడే కాదు ఎప్పటి నుంచో ఎవరు పిలిచినా వెళ్తున్నామని, ఎక్కడైనా తమ తల్లిదండ్రుల పేర విరాళాలు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రంగు హరీశ్, ఉడుత వెంకన్న, గొంగిడి కృష్ణమూర్తి, గడ్డం సిద్దయ్య, కావటి రాజు, కొయ్యడ రాందాసు, తదితరులు పాల్గొన్నారు.

గంగదేవిపల్లిని సందర్శించిన విద్యార్థులు


గంగదేవిపల్లిలో విద్యార్థులు

గీసుకొండ: మండలంలోని జాతీయ ఆదర్శగ్రామం గంగదేవిపల్లిని కాకతీయ యూనివర్సిటీ దూర విద్యలో మాస్టర్ ఆఫ్ సోషల్‌వర్క్(ఎంఎస్‌డబ్ల్యూ) మొదటి సంవత్సరం చదువుతున్న 11 జిల్లాలకు చెందిన 46 మంది విద్యార్థులు ఆదివారం సందర్శించారు. కె. సంపత్ ఆధ్వర్యంలో గ్రామంలోని అభివృద్ధి తీరు తెన్నులను పరిశీలించారు. జిల్లా ట్రైనింగ్ మేనేజర్ కూసం రాజమౌళి, రిసోర్స్ పర్సన్ గూడ సరోజన వారికి గ్రామ వివరాలు, అభివృద్ధి గురించి వివరించారు.

కాంగ్రెస్ నాయకుడికి దేహశుద్ధి?

వరంగల్: ఏనుమాముల ప్రాంతానికి చెందిన ఓ కాంగ్రెస్ నాయకుడికి దేహశుద్ధి జరిగిన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. కాశిబుగ్గకు చెందిన ఒక సీనియర్ ప్రజాప్రతినిధి సామాజిక వర్గానికి చెందిన ముఖ్య అనుచరుడు భూ క్రయవిక్రయాలు చేస్తుంటాడు.ఈ భూముల్లో ఎక్కువ వివాదాస్పదం , ప్రభుత్వ ఆక్రమిత స్థలాలు ఉండడంతో సదరు కాంగ్రెస్ నాయకుడు జోక్యం చేసుకోవడంతో ఇరువురు (ప్రజాప్రతినిధి, ముఖ్య అనుచరుడు) ఒక ఒప్పందానికి వచ్చి అమ్మకాలు చేస్తుంటారు. ఏనుమాముల, కాశిబుగ్గ ప్రాంతాల్లోని ఇందిరమ్మ కాలనీ, ఎస్ఆర్‌నగర్, బాలాజీనగర్, చాకలి ఐలమ్మ కాలనీల్లో ఈ దందా సాగిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వివాదాస్పదమైన భూముల విక్రయాల్లో జోక్యం చేసుకోవడం వల్ల పలువురు బాధితుల ఫిర్యాదుల మేరకు ముఖ్యనేత 14 డివిజన్‌లో పార్టీ కార్యక్రమాలు అప్పగించకుండా దూరంగా ఉంచినట్లు తెలుస్తోంది. ఈ భూముల విక్రయాల సందర్భంగా ఆర్థిక పరమైన లావాదేవిల్లో వచ్చిన తేడాలతో ఇరువురు (ప్రజాప్రతినిధి, ముఖ్య అనుచరుడు) రెండు రోజులు క్రితం ఓ బార్ షాపులో గొడవపడినట్లు తెలిసింది. ఒకరిపై మరొకరు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసారనే ప్రచారం జరిగింది. ఈవిషయంపై ఏనుమాముల పోలీసులను వివరణ కోరగా బార్ షాపు వద్ద స్వల్పంగా ఇరువురి మధ్య వాగ్వాదం జరిగినట్లు తెలిసిందని, ఎలాంటి కేసు నమోదు కాలేదని తెలిపారు.

జీవితంపై విరక్తిచెంది.. యువకుడి ఆత్మహత్య


ప్రేమ్‌కుమార్(ఫైల్)


దామెర: జీవితంపై విరక్తి చెందిన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని దుర్గంపేటలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఊరుగొండ ప్రేమ్‌కుమార్ (28) ఓ బ్యాంకులో క్రెడిట్ కార్డు సేల్స్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. 2020 లో వివాహం కాగా భార్యతో విభేదాలు తలెత్తి ఈ నెల 13న పరస్పర అంగీకారంతో విడాకులు తీసుకున్నారు. ఈ అంశంపై ప్రేమ్‌కుమార్ కొన్ని రోజుల నుంచి మనస్తాపం చెందుతున్నాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి భోజనం చేసిన అనంతరం కుటుంబీకులతో కలిసి నిద్రించాడు. ఆదివారం తెల్లవారుజామున తల్లి లేచిచూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. దీంతో కేకలు వేయగా ఇరుగుపొరుగు వారువచ్చి పోలీసులకు సమాచారం అందించగా వారు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. ప్రేమ్‌కుమార్ తల్లి స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సంతోశ్ తెలిపారు.

విష జ్వరంతో చిన్నారి మృతి


చిన్నారి మృతదేహం

కొత్తగూడ: విష జ్వరంతో ఓ చిన్నారి మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని వేలుబెల్లి శివారు హనుమాన్‌తండాలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. తండాకు చెందిన భుక్యా రాజేందర్, సంధ్య దంపతుల కుమార్తె రూప(18 నెలలు)కు రెండు రోజుల క్రితం జ్వరం వచ్చింది. దీంతో నర్సంపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. అయినా తగ్గకపోవడంతో ఆదివారం మళ్లీ తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు.. చిన్నారి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని, వెంటనే ఎంజీఎం తరలించాలని సూచించారు. దీంతో ఎంజీఎం తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. రూప మృతితో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

పాయబాటలులో వ్యక్తి..



నారాయణ(ఫైల్)

వాజేడు: మండలంలోని పాయబాటలు గ్రామానికి చెందిన అల్లి నారాయణ(43) జ్వరంతో బాధపడుతూ మృతి చెందాడు. నారాయణకు ఐదు రోజుల క్రితం జ్వరం వచ్చింది. ఏటూరు నాగారంలో వైద్యం చేయించినా తగ్గకపోవడంతో వరంగల్‌లోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

రైలు నుంచి జారిపడి మహిళ..

కాశిబుగ్గ : గుర్తుతెలియని రైలు నుంచి జారి పడి ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన కాజీపేట, వరంగల్ రైల్వే స్టేషన్ల మధ్య చోటుచేసుకుంది. జీఆర్పీ ఎస్సై మొయినొద్దీన్ కథనం ప్రకారం.. హనుమకొండ లష్కర్ బజార్‌కు చెందిన సాధియా(42) నాలుగు సంవత్సరాల నుంచి సికింద్రాబాద్ లాలాగూడలో కుమారుడు సల్మాన్, కూమార్తె సల్మాతో కలిసి ఉంటుంది. ఈ క్రమంలో శనివారం గుర్తుతెలియని రైలులో వస్తుండగా జారి పడి మృతి చెందింది. ఈ ఘటనపై డిప్యూటీ ఎస్ఎస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి మృతురాలి తల్లి రహమతున్నీషా బేగంకు అప్పగించామని ఎస్సై మొయినొద్దీన్ ఆదివారం తెలిపారు.

వాహనం ఢీకొని గుర్తుతెలియని యువకుడు..


గుర్తుతెలియని యువకుడి మృతదేహం

దామెర: గుర్తుతెలియని వాహనం ఢీకొని గుర్తుతెలియని యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన దామెర పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై అశోక్ కథనం ప్రకారం.. మండల కేంద్రం సమీపంలోని శ్రీ హర్ష పాఠశాల సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వాహనం ఢీకొనగా ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులకు సమాచారం అందడంతో ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. మృతుడు 35 సంవత్సరాల వయసు ఉండి చామన్ ఛాయ కలిగి ఉన్నాడు. 5 అడుగుల 6 అంగుళాలు సన్నగా కోల మొహంతో ఉన్నాడు. గడ్డంతో నలుపు రంగు ప్యాంటు, నలుపు రంగు టీ షర్టు ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు. ఆచూకీ తెలిసినవారు 8712685228, 8712685020, 8712685226 నంబర్లకు సమాచారం అందించాలని ఎస్సై పేర్కొన్నారు.

సాకులు చెప్పకుండా రుణమాఫీ చేయాలి

- కమ్యూనిస్టులు కావాలని ప్రజల కోరిక
- పార్టీ మారితే క్రిమినల్ యాక్షన్ ఉండాలి
- బీఆర్ఎస్ మనుగడకోసం పోరాటం
- విలేకరుల సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు


రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎన్నికైన శ్రీనివాస్‌రావు

న్యూశాయంపేట : రైతులకు ఇచ్చిన హామీ మేరకు సాకులు చెప్పకుండా రూ. 2 లక్షల రుణమాఫీ చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. హనుమకొండలోని హరితకాకతీయలో మూడు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్ర సమితి నిర్మాణ సమావేశాలు శనివారం ముగిశాయి. ఆదివారం హనుమకొండలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాసమస్యల పరిష్కారానికి కమ్యూనిస్టులు ఉండాలనే భావన ప్రజల్లో ఉందన్నారు. చట్టసభల్లో కమ్యూనిస్టులు ఉంటే ప్రజాసమస్యలపై ప్రశ్నిస్తారని వరంగల్ పోరుగడ్డలో మూడు రోజుల పాటు జరిగిన పార్టీ నిర్మాణ సమావేశాల్లో దేశ, రాష్ట్ర పరిస్థితులు చర్చకు వచ్చాయన్నారు. ప్రజల్లో పాలక పక్షాలపై ఉన్న అసంతృప్తిని గుర్తించి కమ్యూనిస్టు పార్టీగా పోరాట పంథాను ఏ విధంగా తీసుకెళ్లాలనే చర్చ జరిగిందన్నారు. ఇటీవల ఒక పార్టీలో గెలిచిన వారు మరో పార్టీలో చేరి ప్రజా తీర్పును అపహాస్యం చేస్తున్నారన్నారు. పార్టీ మారితే పదవి ఊడే విధంగా క్రిమినల్ యాక్షన్ ఉండాలని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో చెరువులు, ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం ఏర్పాటైన 'హైడ్రా'కు మద్దతు తెలుపుతున్నామని, పేదల జోలికి వెళ్లకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. బీఆర్ఎస్ మనుగడకోసం పోరాటం చేస్తూ ఇబ్బందులు పడుతోందని, ప్రజలు ఆ పార్టీని తిరస్కరించారన్నారు. సెప్టెంబర్ 2న దేశవ్యాప్త ఆందోళనలో భాగంగా అధికధరలపై ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. సెప్టెంబర్ 11 నుంచి 17 వరకు 'తెలంగాణ సాయుధ పోరాటం-కమ్యూనిస్టుల పాత్ర' అనే అంశంపై వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. కాగా, నిర్మాణ సమితి సమావేశాల్లో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులుగా వరంగల్‌కు చెందిన తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు, మేడ్చల్‌కు జిల్లాకు చెందిన బాలమల్లేశ్‌ను ఎన్నుకున్నారు.